
రాజ్‌భవన్‌లో గవర్నర్ రవిని కలుసుకున్న స్పీకర్ అప్పావు

గవర్నర్‌తో స్పీకర్ భేటీ

చెన్నై, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవితో శాసనసభ స్పీకర్ అప్పావు భేటీ అయ్యారు. శుక్రవారం ఉదయం రాజ్‌భవన్‌కు వెళ్లిన అప్పావు.. నూతన సంవత్సరంలో జరిగే తొలి అసెంబ్లీ సమావేశాలను ప్రారంభించాలని ఆహ్వానించారు. శాసనసభ సమావేశాలు ఈ నెల 6న ప్రారంభమవుతున్న విషయం విధితమే ఈ సమావేశాలు గవర్నర్ ప్రసంగంతో ప్రారంభం కావటం ఆనవాయితీ. ఆ మేరకు సోమవారం నుంచి జరిగే శాసనసభ సమావేశాలకు ఆహ్వానించే నిమిత్తం శుక్రవారం ఉదయం స్పీకర్ అప్పావు రాజ్‌భవన్‌కు వెళ్ళి గవర్నర్ ఆర్ఎన్ రవితో సమావేశమయ్యారు. గత యేడాది శాసనసభ సమావేశాల ప్రారంభంలో గవర్నర్ ప్రభుత్వ ప్రసంగ పాఠాన్ని పూర్తిగా చదవకుండా తొలి, చివరి పేజీలను మాత్రమే చదివి, తన సొంత అభిప్రాయాలను కూడా వ్యక్తం చేశారు. దీంతో గవర్నర్ అభిప్రాయాలను సభ రికార్డుల నుండి స్పీకర్ తొలగించారు. ఆంగ్ల ప్రసంగ పాఠం తమిళ అనువాదాన్ని చదువక ముందే గవర్నర్ సభ నుంచి నిష్క్రమించారు. ఆ తర్వాత గవర్నర్‌కు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ఐదేళ్ల పదవీ కాలం ముగిసినా గవర్నర్‌గా ఆర్ఎన్ రవినే కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఈ పరిస్థితులలో ఈ నెల 6న జరిగే శాసనసభ తొలిసమావేశంలో గవర్నర్ ఎలా వ్యవహరిస్తారన్నది చర్చనీయాంశమైంది.




రాజ్‌భవన్‌లో కట్టబ్రహ్మన, వేలునాచియార్ల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి - గాంధీ మండపం ప్రాంగణంలో వీర పాండ్య కట్టబ్రహ్మన విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి, తెలుగు ప్రముఖులు - మదురైలో కట్టబ్రహ్మన విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాష్ట్రమంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగంతెన్నరసు తదితరులు

ఘనంగా వీర పాండ్య కట్టబ్రహ్మన జయంతి


సేలంలో చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎడప్పాడి

● పలువురి నేతల ఘన నివాళి

ప్యారీస్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆంగ్లేయుల ఆధిపత్యాన్ని ఎదిరించిన 18వ శతాబ్దానికి చెందిన తెలుగు తల్లి ముద్దు బిడ్డ, తొలి స్వాతంత్ర్య సమరయోధుడు వీర పాండ్య కట్టబ్రహ్మన 265వ జయంతిని రాష్ట్రవాప్తంగా శుక్రవారం నిర్వహించి ఘన నివాళులర్పించారు. 1760లో పాంచాలకుర్చీలో జన్మించిన కట్టబ్రహ్మన చిన్ననాటి నుంచే దేశభక్తిని అలవరుచుకొని ఆ ప్రాంతాన్ని పరిపాలించారు. భారతదేశంలో అడుగుపెట్టిన బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ వ్యవసాయానికి పన్ను విధించడాన్ని వ్యతిరేకించిన విప్లవ వీరుడు కట్టబ్రహ్మన్నకు 1799 అక్టోబర్ 16న కైయత్తారులో ఉరిశిక్ష విధించారు. ఆ వీరుడి జయంతి, వర్థంతి సందర్భంగా రాష్ట్రవాప్తంగా ప్రభుత్వంతో పాటు వీర పాండ్య కట్టబ్రహ్మన వంశీయులు పలు తెలుగు సంఘాలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి.

మదురైలో...

మదురై పెరియార్ బస్టాండ్ సమీపంలోని కట్టబ్రహ్మన్న విగ్రహానికి రాష్ట్రప్రభుత్వం తరుపున మంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగంతెన్నరసు, డీఎంకే ఎమ్మెల్యేలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నాడీఎంకే తరుపున మాజీమంత్రులు సెల్లూరు రాజు, కడంబూర్ రాజు, రాజేంద్ర బాలాజీ, ఎమ్మెల్యే రాజన్ చెల్లప్ప తదితరులు నివాళులర్పించారు. సేలంలో తన నివాసంలో కట్టబ్రహ్మన్న చిత్రపటానికి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పూలు చల్లి నివాళులర్పించారు.

గిండిలో...

స్థానిక గిండి రాజ్‌భవన్‌లో స్వాతంత్ర్య సమరయోధులు వీర పాండ్య కట్టబ్రహ్మన, వేలునాచియార్ల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుల చిత్రపటాలకు గవర్నర్ ఆర్ఎన్ రవి నివాళులర్పించారు. అలాగే గిండీ గాంధీ మండపం ప్రాంగణంలో అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏబీటీఎఫ్) అధ్యక్షులు ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి తదితరులు కట్టబ్రహ్మన విగ్రహానికి నివాళులర్పించారు. ప్రధాన కార్యదర్శి నాయకర్ నందగోపాల్, ఉపాధ్యక్షులు డాక్టర్ సీఎం కిషోర్, వీజీ జయకుమార్, ట్రెజరర్ కేవీ జనార్థనం, భుజంగరావు, వంజరపు శివయ్య ఉన్నారు.

రాయపేటలో...

రాయపేటలోని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) ప్రధానకార్యాలయం సత్యమూర్తి భవన్‌లో స్వాతంత్ర్య సమరయోధులు వీర పాండ్య కట్టబ్రహ్మన, వేలునాచియార్ల జయంతి ఘనంగా నిర్వహించారు. ఆ మహనీయుల చిత్రపటాలకు టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుందగై, ఎంపీ సుధ, మాజీ కేంద్రమంత్రి కేవీ తంగ బాలు, మాజీ ఎంపీ పీటర్ ఆల్ఫోన్స్, విల్లివాక్కం టి.సురేష్, స్వర్ణాసేతు రామన్, ఎస్ఏ వాసు తదితరులు నివాళులర్పించారు. తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ రాణి వేలునాచియార్ల జయంతి సందర్భంగా పనయూర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలు చల్లి నివాళి అర్పించారు.

బీజేపీ రాష్ట్ర ఇన్‌-చార్జిగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

● 8న నగరానికి రాక


కిషన్‌రెడ్డి

ప్యారీస్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జిగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన ఈ నెల 8వ తేదీ నగరానికి రానున్నారు. పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడి ఎంపికపై చర్చించనున్నారు. మళ్లీ ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైనే ఎంపిక చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. బీజేపీలో జాతీయ అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపికైన వారు వరుసగా రెండేళ్లు ఆ పదవిలో కొనసాగుతారు. పార్టీ అధిష్టానం సూచనల మేరకు పలు రాష్ట్రాలకు నూతన అధ్యక్షులను ఎంపిక చేయనున్నారు. ఈ క్రమంలో అన్నామలై పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో మళ్లీ ఆ పదవి ఆయనకే కట్టబెట్టే అవకాశాలున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. 2026వ సంవత్సరం రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న కారణంగా, ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందే రాష్ట్రాల పార్టీ అధ్యక్షులను నియమించాలని అధిష్టానం నిర్ణయించింది. రాష్ట్రపార్టీ ఇన్‌చార్జ్ హోదాలో తొలిసారి నగరానికి విచ్చేయనున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఘనంగా స్వాగతించేందుకు బీజేపీ శ్రేణులు ఆ ఏర్పాట్లు చేస్తున్నారు.

నారాయణి పీఠం సేవలు ప్రశంసనీయం

కేంద్రమంత్రి శ్రీపాద నాయక్ ● ఘనంగా శక్తి అమ్మ 49వ జయంతి వేడుకలు


శక్తి అమ్మకు పుష్పాభిషేకం - జయంతి వేడుకల్లో పాల్గొన్న భక్తులు

వేలూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక సేవతో పాటు విద్య, వైద్యరంగాల్లో నారాయణి పీఠం అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కేంద్ర విద్యుత్, పునరుత్పాదక ఇంధన శాఖ సహాయమంత్రి శ్రీపాద యసో నాయక్ పేర్కొన్నారు. శ్రీపురం నారాయణి పీఠం వ్యవస్థాపకులు శక్తి అమ్మ 49వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గణపతి యాగం, ఆయుష్ హోమం, నారాయణి మూలమంత్ర హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం వెయ్యి మంది మహిళలు దీపాలు, పసుపు నీటి కుండలు పట్టుకొని ఏనుగు ముందు వెళ్తుండగా, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఉదయం 11 గంటలకు శక్తి అమ్మకు ఆహ్వానం, హారతి, పాదపూజ, పుష్పాభిషేకం, దివ్యప్రవచనాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వర్ణాలయం, నారాయణి పీఠం చేస్తున్న ఆధ్యాత్మిక సేవలు ప్రశంసనీయమని కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర సహాయ మంత్రి శ్రీపాద నాయక్ కొనియాడారు. వేడుకల్లో ఎమ్మెల్యే నందకుమార్, ఏపీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి, పారిశ్రామికవేత్త శాంతిభూషణ్, మేయర్ సుజాత, ముక్కసచ్చిదానంద స్వామి, ధన్వంతరీ పీఠం స్థాపకులు మురళీధరస్వామి సహా పలువురు ప్రముఖులు, స్వదేశీ, విదేశీ భక్తులు పాల్గొన్నారు. భక్తులను ఆశీస్సులందించిన శక్తి అమ్మ తీర్థప్రసాదాలు అందజేశారు.


శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసి 2023-24 సిఫార్సులతో కూడిన నివేదికను సమర్పిస్తున్న ఐదవ పోలీసు కమిషన్ అధ్యక్షులు, జస్టిస్ సీటీ సెల్వం

21నుంచి శివగంగ జిల్లాలో సీఎం స్టాలిన్ పర్యటన

పెరంబూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ నెల 21, 22 తేదీల్లో శివగంగ జిల్లాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా అళగప్ప విశ్వవిద్యాలయంలో లైబ్రరీని 21న ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. అదేవిధంగా వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యం లో సుమారు 40,000 మంది లబ్దిదారులకు సీఎం సంక్షేమ సహాయాలు అందజేయనున్నారు. అలాగే, జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు తదితరాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించడంతో పాటు పలు ప్రాంతాలకు వెళ్లి పథకాల అమలు ప్రజల నుంచి సీఎం అడిగి తెలుసుకోనున్నారని మంత్రి పెరియకరుప్పన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మతోన్మాద శక్తులకు చోటివ్వద్దు

● సీపీఎం జాతీయ సమన్వయకర్త ప్రకాష్ కారత్ పిలుపు


ప్రతినిధుల సభలో ప్రకాష్ కారత్, పార్టీ నేతలు

చెన్నై, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మతోన్మాద శక్తులకు చోటివ్వరాదని సీపీఎం జాతీయ సమన్వయకర్త ప్రకాష్ కారత్ పిలుపునిచ్చారు. సీపీఎం 24వ రాష్ట్ర మహాసభలు విల్లుపురంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలుత విల్లుపురంలోని కల్యాణ మండపంలో ప్రతినిధుల సభ జరిగింది.

ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని నేతలు ఆవిష్కరించారు. సాయంత్రం 4 గంటలకు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. విల్లుపురం-చెన్నై రోడ్డు నుంచి ప్రారంభమైన ర్యాలీ కాట్పాడి వంతెన, ప్రభుత్వ ఆస్పత్రి, కొత్త బస్టాండు మీదుగా మహానాడు వేదిక ప్రాంగణానికి చేరుకుంది. అనంతరం కార్పొరేషన్ మైదానంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో ప్రకాష్ కారత్ మాట్లాడుతూ... నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మతరాజకీయాలు చేస్తోందన్నారు. మసీదుల కింద ఆలయాలున్నాయం టూ మతఘర్షణలకు శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రంలో డీఎంకే నేతృత్వంలో లౌకిక పార్టీల కూటమిని ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. ఎలాంటి పరిస్థితుల్లో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లను రాష్ట్రంలోకి అడుగుపెట్టనివ్వరాదని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఆ పార్టీకి ప్రజలు గుణపాఠం చెప్పాలని ప్రకాష్ కారత్ పిలుపునిచ్చారు. పార్టీ జాతీయ కార్యదర్శవర్గ సభ్యులు ఎంఏ బేబి, బృందాకారత్, రాష్ట్ర కార్యదర్శి కె.బాలకృష్ణన్, కేంద్ర కమిటీ సభ్యులు వాసుకి, టీకే రంగరాజన్, ఎంపీలు వెంకటేశన్, సచ్చిదానందం తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం వద్ద హైటెన్షన్

● స్టాలిన్‌తో దురైమురుగన్ భేటి

చెన్నై, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడిలో సీనియర్ మంత్రి దురైమురుగన్ నివాసంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) అధికారులు తనిఖీలు నిర్వహించిన నేపథ్యంలో చెన్నై సచివాలయం వద్ద శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం వరకు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సచివాయంలోకి వెళ్లేవారిని పోలీసులు తనిఖీ చేసిన మీదటే అనుమతించారు. మీడియా ప్రతినిధులను సైతం గుర్తింపు కార్డులను పరిశీలించిన తర్వాత సచివాలయం లోనికి అనుమతించారు.

ఇక కాట్పాడిలో తన నివాసంలో ఈడీ అధికారులు తనిఖీ చేయటానికి వచ్చారనే విషయం కోట్టూరు ప్రాంతంలోని నివసిసస్తున్న దురైమురుగన్ తెలిసింది. దీంతో ఆయన హుటాహుటిన సచివాలయానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్‌తో పావుగంటకు పైగా సమావేశమై ఈడీ తనిఖీలు గురించి చర్చించారు.

పొంగల్ టోకెన్ల పంపిణీ ప్రారంభం


టోకెన్లు ఇస్తున్న రేషన్ ఉద్యోగులు

పెరంబూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పొంగల్ బహుమతులు అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా టోకెన్ల పంపిణీ ప్రారంభమైంది. రేషన్ ఉద్యోగులు శుక్రవారం నుంచి ఇంటింటికీ వెళ్లి టోకెన్లు ఇస్తున్నారు. ఈ ఏడాది పొంగల్ పండుగ సందర్భంగా ప్రత్యేకంగా కిట్ అందిస్తున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. సంబంధిత రేషన్ దుకాణాల ద్వారా అందించనున్న పొంగల్ బహుమతుల టోకెన్ల పంపిణీ శుక్రవారం ప్రారంభమైంది. ఈ టోకెన్లలో బహుమతులు పొందాల్సిన తేదీ, సమయం తదితరాలున్నాయి. టోకెన్లలో తెలిపిన ప్రకారం, లబ్దిదారులు రేషన్ దుకాణాలకు వెళ్లి పొంగల్ బహుమతి పొందాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం 100 మంది, మధ్యాహ్నం 100 మందికి బహుమతి అందించేలా నిర్ణయించారు. రేషన్ దుకాణాల వద్ద ప్రజల రద్దీని అరికట్టేలా టోకెన్ల విధానం అమలుచేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

జైళ్ల శాఖలో అవినీతి!

● 11 ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు

పెరంబూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో జైళ్ల శాఖకు ఉపకరణాల కొనుగోళ్లలో కోట్లాది రూపాయల మేర అవినీతి జరిగిందనే ఆరోపణల నేపథ్యంలో మదురై జైళ్ల శాఖలో పనిచేస్తున్న ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, నిర్వహణాధికారి సహా 11 మంది ఇళ్లల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు శుక్రవారం సోదాలు జరిపారు. కడలూరు కేంద్ర జైలులో 2016 ఫిబ్రవరి 10 నుంచి 2021 జూన్ 27వ తేది వరకు ఎస్పీగా పనిచేసిన ఊర్మిళ ప్రస్తుతం మదురై కేంద్ర కారాగారంలో ఎస్పీగా పనిచేస్తున్నారు. అలాగే, పాళయంకోట జైలులో అడిషినల్ ఎస్పీగా 2019 జూన్ 25 నుంచి 2021 జూన్ 9వ తేది వరకు పనిచేసిన వసంతకన్నన్, వేలూరు జైలు నిర్వహణాధికారిగా పని చేసిన త్యాగరాజన్.. ప్రస్తుతం మదురై జైలులో పనిచేస్తున్నారు. వీరు గతంలో పని చేసిన జైళ్లలో ఉపకరణాలను చెన్నైకి చెందిన ఓ సంస్థ నుంచి హోల్‌సేల్‌గా కొనుగోలు చేశారని, దానికి సంబంధించి వారు ముగ్గురూ భారీగా కమీషన్లు అందుకున్నారని, కొనుగోలు చేసిన ఉపకరణాలు నాణ్యత లేవనే ఆరోపణలున్నాయి. అలాగే, మదురై జైలు ఖైదీలు తయారుచేసిన స్టేషనరీ, వైద్య ఉపకరణాలు ప్రభుత్వాసుపత్రులకు పంపినట్లు నకిలీ రసీదులు సృష్టించి, సుమారు రూ.100 కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని 2021లో ఫిర్యాదులందాయి. దీనిపై స్పందించిన ఆడిట్ డిపార్ట్‌మెంట్ అధికారులు.. 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరంలో మదురై జైలు ఆదాయ, వ్యయాలు సమర్పించాలని ఆదేశించినా, మదురై జైలు నిర్వాహకులు స్పందించలేదు. ఈ క్రమంలో స్టేషనరీ తయారీకి రూ.1.51 కోట్ల విలువైన ముడిపదార్థాలు విక్రయించిన సంస్థ సమర్పించిన జీఎస్టీ నివేదికను ఆడిట్ అధికారులు పరిశీలించగా, ఈ సంస్థ ఎలాంటి ముడిపదార్థాలు మదురై జైలుకు విక్రయించలేదని నిర్ధారణ అయింది. ఈ వ్యవహారంపై అవినీతి నిరోధక శాఖ ఆధారాలకు ఫిర్యాదు మేరకు ఎస్పీ ఊర్మిళ, అడిషినల్ ఎస్పీ వసంతకన్నన్, నిర్వహణ అధికారి త్యాగరాజన్, జైళ్లకు ముడి పదార్థాలు అందించేందుకు టెండర్లు పొందిన ప్రైవేటు సంస్థలు కలిపి మొత్తం 11 మందిపై కేసు నమోదుచేశారు. తాజాగా, మదురై ఏసీబీ ఎస్పీ నేతృత్వంలో అధికారులు శుక్రవారం ఉదయం, ఎస్పీ ఊర్మిళ, అడిషినల్ ఎస్పీ వసంతకన్నన్, నిర్వహణాధికారి త్యాగరాజన్, టెండర్లు పొందిన సంస్థ ప్రతినిధులు చెన్నైకి చెందిన మహమ్మద్ అలి, చెన్నై కొడుంగైయూర్‌కు చెందిన శ్రీనివాసన్, శాంతి, తిరునల్వేలి జిల్లా పాళయంకోటకు చెందిన శంకరసుబ్బు, ధనలక్ష్మి, వెంకటేశ్వరి సహా 11 మంది ఇళ్లల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో, కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అలాగే, వారి బ్యాంక్ ఖాతాల వివరాలు పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వాషర్‌మెన్‌పేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా తిల్లైగంగానగర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు తెలిపారు. తిల్లైగంగానగర్, నంగనల్లూర్, పల్లవన్‌తాంగల్, జీవన్ నగర్, సంజయ్‌గాంధీ నగర్, వేళచ్చేరి, ఆదంబాక్కం, ఆండాళ్ నగర్, వానువంపేట, బృందావన్ నగర్, మహాలక్ష్మి నగర్, శాంతి నగర్, పుళిదివాక్కం, ఉల్లగరం, ఏజీఎస్ కాలని వేళచ్చేరి, మోగనాపురి, ఆదంబాక్కం న్యూ కాలని తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

10న వైకుంఠ ద్వార ప్రవేశం

పెరంబూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్ పార్థసారథి ఆలయంలో వైకుంఠ ద్వారం ప్రవేశం ఈ నెల 10వ తేది తెల్లవారుజామున 4.30 గంటలకు జరుగనుంది. వైకుంఠ ద్వారం ప్రవేశ రుసుము ఒకరికి రూ.500లుగా నిర్ణయించారు. ఈ నెల 6వ తేది నుంచి టిక్కెట్ల విక్రయం ప్రారంభం కానుంది. ముందుగా వచ్చిన 500మందికి ఉచితదర్శనం కల్పించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

6న ఐల్యాండ్ గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ ప్రారంభం

వాషర్‌మెన్‌పేట, జనవరి3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐల్యాండ్ గ్రౌండ్‌లో ప్రభుత్వ ఎగ్జిబిషన్ ఈ నెల 6వ తేది ప్రారంభం కానుంది. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది జనవరి మొదటి వారం నుంచి మార్చి వరకు ఎగ్జిబిషన్ నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది ఎగ్జిబిషన్‌ను సోమవారం రాష్ట్ర మంత్రులు ఎం.సుబ్రమణ్యం, పీకే శేఖర్ బాబు, రాజేంద్రన్ ప్రా రంభించనున్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలకు చెందిన 53 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే, వినోద భరిత కార్యక్రమాలు, ఫుడ్ కోర్టు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఎగ్జిబిషన్ ప్రవేశ రుసుము పెద్దలకు 40, పిల్లలకు రూ.25గా నిర్ణయించారు.

చేపల దుకాణాలకు చ.అ రూ.25 అద్దె

వాషర్‌మెన్‌పేట, జనవరి3(ఆంధ్రజ్యోతి): స్థానిక చింతాద్రిపేట జ్యోతి అమ్మాళ్ నగర్‌లో 82 చేపల దుకాణాలను జీసీసీ నిర్మించింది. ఒక్కో దుకాణం 25 చ.అ విస్తీర్ణంలో ఏర్పాటయ్యాయి. ఈ దుకాణాలకు నెల వారీ అద్దెగా ఒక చ.అ స్థలానికి రూ.25 నిర్ణయించింది. ఆ ప్రకారం, ఒక దుకాణానికి నెలవారీ అద్దె రూ.625 వసూలుచేయనున్నారు. ఈ దుకాణాలను త్వరలో లబ్ధిదారులకు కేటాయించనున్నామని, అనంతరం చేపల మార్కెట్ ప్రజలకు అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు.

తిరుచ్చి-దమామ్ మధ్య విమానాలు

వాషర్‌మెన్‌పేట, జనవరి3(ఆంధ్రజ్యోతి): తిరుచ్చి-సౌదీ అరేబియా దేశంలోని దమామ్ నగరానికి గురువారం నుంచి విమాన సేవలు ప్రారంభమయ్యాయి. ఎయి ర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ గురు, ఆదివారాలు ఈ విమాన సేవలు అందించనుంది. ఆ ప్రకారం, తిరుచ్చి నుంచి ఉదయం 6.05 లకు బయల్దేరే విమానం 9.10 గంటలకు దమా మ్ (ఆ దేశ సమయం ప్రకారం) చేరుకుంటుంది. దమామ్ నుంచి ఉదయం 10.10 గంటలకు (ఆ దేశ సమయం ప్రకారం) బయల్దేరి సాయంత్రం 5.40 గంటలకు తిరుచ్చి చేరుకుంటుంది. గురువారం తిరు చ్చి నుంచి బయల్దేరిన విమానంలో 123 మంది ప్రయాణించగా, ఆదివారం 130 మంది రిజర్వేషన్ చేసుకున్నారని అధికారులు తెలిపారు.

10 నుంచి 'అంతర్జాతీయ బెలూన్ ఫెస్టివల్'

వాషర్‌మెన్‌పేట, జనవరి3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 12వ తేది వరకు తిరువిడందైలో అంతర్జాతీయ బెలూన్ ఫెస్టివల్ జరుగనుంది. మహాబలిపురం బీచ్ ప్రాంతంలో 2022లో ఈ బెలూన్ ఫెస్టివల్ ప్రారంభించారు. మహాబలిపురం సమీపం తిరువిడందైలోని నిత్యకల్యాణ పెరుమాళ్ ఆలయానికి చెందిన బీచ్ ప్రాంతంలో ఈ ఫెస్టివల్ జరుగనుంది. జపాన్, థాయ్‌లాండ్, ఫ్రాన్స్ ఫ్రాన్స్, బ్రెజిల్, బెల్జియం, వియత్నాం తదితర దేశాలకు చెందిన భారీ బెలూన్లు ఈ ప్రదర్శనకు రానున్నాయి. వేడుకల ప్రాంగణంలో వస్తువులు, తినుబండారాల విక్రయ స్టాల్స్ ఏర్పాటుచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

జర్నలిజం కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు నైపుణ్యాభివృద్ధి సంస్థ, చెన్నై లయోలా కళాశాల సంయుక్తంగా జర్నలిజం, ఏఐ సర్టిఫికెట్ కోర్సులు అందిస్తున్నాయి. ఈ మేరకు లయోలా కళాశాల నిర్వాహకులు విడుదల చేసిన ప్రటనలో... గత ఏడాది వార్తలు రాసే విధానంలో జర్నలిజం కోర్సు ఉచితంగా అందించామని, ప్రస్తుతం ఈ కోర్సులో ఏఐ టెక్నాలజీ వినియోగించడం అంశం కూడా చేర్చామన్నారు. డిగ్రీ పూర్తిచేసిన 20 నుంచి 25 ఏళ్లలోపున్న వారు ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. సోమవారం నుంచి శుక్రవారం వరకు తరగతులు నిర్వహిస్తారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 5వ తేదిలోపు https:// tinyurl.com/3c3te5kc అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలి.

నేడు తచ్చంకురిచ్చిలో జల్లికట్టు

● ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



జల్లికట్టు గ్రౌండును అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ

ప్యారీస్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా గంధర్వకోట సమీపంలోని తచ్చంకురిచ్చి గ్రామంలో శనివారం జల్లికట్టు పోటీలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పొంగల్ పండుగను సంప్రదాయ బద్ధంగా, కోలాహలంగా జరుపుకొనేందుకు రాష్ట్రవాప్తంగా పల్లెలు ముస్తాబవున్నాయి. పుదుకోట, మదురై జిల్లాలలో సంప్రదాయ సాహసక్రీడగా జల్లికట్టు నిర్వహించుందుకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది తొలి జల్లికట్టు పోటీలు పుదుకోట జిల్లాలోని తచ్చంకురిచ్చిలో జరుపుకొనేందుకు అనుమతి కోరుతూ.. పోటీ నిర్వాహకులు ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పించారు. పరిశీలించిన ప్రభుత్వం జల్లికట్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఎంపిక చేసిన గ్రౌండ్‌లో వాడివాసల్, గ్యాలరీ, వైద్యశిబిరం, పోలీస్ కంట్రోల్ రూమ్, అగ్నిప్రమాద నివారణ ఏర్పాట్లు సిద్ధంచేశారు. పోటీల్లో పాల్గొనే ఎద్దులు, వాటిని అదుపుచేయనున్న యువకులకు ఆన్‌లైన్‌లో టోకెన్లు ఇచ్చారు. ఇదిలా ఉండగా జల్లికట్టు గ్రౌండ్‌లో పూర్తి చేసిన ఏర్పాట్లను పుదుకోట జిల్లా కలెక్టర్ ఎం.అరుణ, తాహసీల్దార్ ఐశ్వర్య, పశుసంవర్ధక శాఖ వైద్యులు, అగ్నిమాపక, పోలీసు శాఖ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. కాగా, జల్లికట్టు నిర్వాహణలకు రాష్ట్రప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో జల్లికట్టు పోటీ నిర్వాహకులు హర్షం వ్యక్తంచేశారు. శనివారం రాష్ట్రంలో జరగనున్న తొలి జల్లికట్టు పోటీ నిర్వహణకు సిద్ధం చేసిన ఏర్పాట్లు తృప్తికరంగా ఉన్నాయని, అన్ని శాఖల అధికారుల సహకారంతో ఈ పోటీలను విజయవంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ అరుణ తెలిపారు.

బీజేపీ పశ్చిమ జిల్లా ప్రాంతీయ అధ్యక్షుడిగా కిరణ్‌కుమార్



కిరణ్‌కుమార్‌ను అభినందిస్తున్న పార్టీ శ్రేణులు

తిరుత్తణి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా పశ్చిమ ప్రాంతీయ అధ్యక్షుడిగా ఎ.కిరణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషిచేయనున్నట్లు ఆయన తెలిపారు. కాగా, కిరణ్‌కుమార్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్య శ్రీనివాసులు, ఆర్ఎస్ఎస్ తిరుత్తణి నగర యూనియన్ అధ్యక్షుడు డా.శ్రీకిరణ్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు టీడీఎస్ ఢిల్లీ బాబు, ప్రధాన కార్యదర్శి మునియప్పన్, ఉపాధ్యక్షుడు మునుస్వామి, మాణిక్యం, యూత్ టీమ్ లీడర్ ఎ.వేలు, జిల్లా న్యాయవాదుల విభాగం కార్యదర్శి హరిప్రసాద్, ఐటీ విభాగం హెడ్ రోహిత్, హేమంత్, కార్యనిర్వాహకులు వెంకటసుబ్రమణి, గోవిందస్వామి, శ్రీనివాసన్, పెరుమాళ్ సహా పలువురు కార్యకర్తలు అభినందించారు.

హస్తకళా ప్రదర్శన ప్రారంభం



ప్రదర్శన ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ హాలులో ఏర్పాటుచేసిన హస్తకళా ప్రదర్శనను జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో ఇత్తడి దీపాలు, తంజావూరు కళాఖండాలు, నవరత్నాల మాలలు, పంచలోహ విగ్రహాలు సహా పలు రకాలున్నాయి. 13వ తేది వరకు ఈ ప్రదర్శన కొనసాగుతుందని, విక్రయాలపై 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

తిరుత్తణిహుండీ ఆదాయం రూ.64.72 లక్షలు



లెక్కింపులో పాల్గొన్న ఆలయ ఉద్యోగులు

తిరుత్తణి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి సుబ్రమణ్యస్వామి వారి హుండీ ఆదాయం రూ.64.72లక్షలు వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రసిద్ధిచెందిన ఈ ఆలయానికి పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని, హుండీల్లో కానుకలు సమర్పిస్తుంటారు. గత తొమ్మిది రోజుల హుండీ లెక్కింపు ఆలయ అధికారుల పర్యవేక్షణలో చేపట్టారు. మొత్తం రూ.64.72 లక్షల నగదు, 47 గ్రాముల బంగారం, 2,975 గ్రాముల వెండి భక్తులు కానుకలుగా సమర్పించారని అధికారులు తెలిపారు.

8 వరకు మోస్తరు వర్షాలు

వాషర్‌మెన్‌పేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తూర్పు దిశ గాలుల వేగంలో మార్పుల కారణంగా తమిళనాడు, పుదుచ్చేరిలో ఈ నెల 8వ తేది వరకు మోస్తరు వర్షాలు కురువనున్నాయి. ఈ మేరకు వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ఇంకా నిష్క్రమించలేదు. ఒకటి, రెండు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో, తూర్పు దిశ గాలుల వేగంలో మార్పు కారణంగా తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. అలాగే, ఉదయం వేళల్లో మంచు కురుస్తుంది. రాజధాని నగరం చెన్నైలో ఆకాశం మేఘావృతంగా ఉంటూ ఉదయం వేళల్లో మంచు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

శ్మశానవాటికల్లో 'స్వచ్ఛభారత్'



వలసరవాక్కం మండలంలోని శాంతినగర్ శ్మశానవాటికలో శుభ్రం చేస్తున్న కార్మికులు

పెరంబూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్మశానవాటికల్లో శుక్రవారం స్వచ్ఛభారత్ చేపట్టారు. జీసీసీ పరిధిలో 203 శ్మశానవాటికలున్నాయి. ఈ శ్మశానవాటికల్లో శుక్రవారం పారిశుధ్య కార్మికులు శుభ్రం చేసి వ్యర్థాలను తొలగించారు. అలాగే, అనుమతి లేకుండా ఏర్పాటుచేసిన బ్యానర్లు, గోడ ప్రకటనలు, ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు తొలగించారు.

రోడ్ల అభివృద్ధికి రూ.87 కోట్లు

పెరంబూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి రూ.87 కోట్లు కేటాయించినట్లు కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ఈరోడ్ జిల్లాలో ఎస్‌హెచ్ 20 రోడ్డు విస్తరణకు రూ.36.45 కోట్లు, తిరుప్పూర్ జిల్లా మేట్టుకడై-ముత్తంపాళయం రోడ్డు విస్తరణకు రూ.6.84 కోట్లు కేటాయించామన్నారు. అలాగే, మదురై జిల్లాలో ఎస్‌హెచ్ 154 విస్తరణకు రూ.18.29 కోట్లు, తంజావూరు, తిరుచ్చి జిల్లాల్లో రూ.20.52 కోట్లు, దిండుగల్ జిల్లాలో రూ.5.8 కోట్ల వ్యయంతో రోడ్ల విస్తరణ చేపట్టనున్నట్లు, ఈ రోడ్ల విస్తరణతో ఆ మార్గాల్లో ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని కేంద్ర మంత్రి తెలిపారు.

కట్ట బ్రహ్మన త్యాగం చిరస్మరణీయం : దేవరకొండ రాజు



చెన్నై, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, తెలుగుతల్లి ముద్దుబిడ్డ వీరపాండ్య కట్టబ్రహ్మన త్యాగం చిరస్మరణీయమని 'తమిళనాడు తెలుగు పీపుల్ ఫౌండేషన్' అధ్యక్షులు దేవరకొండ రాజు శ్లాఘించారు. కట్టబ్రహ్మన 265వ జయంతిని పురస్కరించుకుని గిండిలోని గాంధీమండపం ప్రాంగణంలో వున్న ఆయన విగ్రహానికి ఫౌండేషన్ బృందం ఘనంగా నివాళులర్పించింది. ఈ సందర్భంగా రాజు బృందం కట్ట బ్రహ్మన విగ్రహానికి పుష్పమాల వేసి నివాళులర్పించడంతో పాటు కేక్ కట్ చేశారు. ఈ వేడుకల్లో సంస్థ ఉపాధ్యక్షులు కిర్లంపల్లి శ్రీనివాసరావు తదితరులు కూడా పాల్గొన్నారు.

22న జేఈఈ మెయిన్స్

వాషర్‌మెన్‌పేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఎన్ఐటీ తదితర కేంద్ర ఉన్నత విద్యా సంస్థల్లో యూజీ కోర్సుల్లో చేరేందుకు జాతీయ పరీక్షా ఏజెన్సీ (ఎన్టీఏ) ప్రతి ఏడాది రెండు దశల్లో ప్రధాన పరీక్ష నిర్వహిస్తోంది. ఆ ప్రకారం, 2025-26 విద్యా సంవత్సరానికి జేఈఈ మొదటి పరీక్ష ఈ నెల 22 నుంచి 30వ తేది వరకు జరుగనుంది. ఈ పరీక్షకు దరఖాస్తు స్వీకరణ నవంబరు 22వ తేదీతో ముగిసింది. ఆ ప్రకారం, బీఈ, బీటెక్ కోర్సులకు మొదటి పేపరు 22,23,24,29 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం నిర్వహించనున్నారు. ఇక, బీఆర్క్, బి.ప్లానింగ్ కోర్సులకు రెండో పేపరు 30వ తేది మధ్యాహ్నం నిర్వహించనున్నారు. హాల్‌టిక్కెట్లు విడుదల త్వరలో ప్రకటిస్తామని, పరీక్షా ఫలితాలు ఫిబ్రవరి 12వ తేది విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా, తమిళం, ఆంగ్లం, హిందీ అని 13 భాషల్లో నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే.

810 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం

వాషర్‌మెన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక అత్తిపట్టులోని ఉత్తర చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రంలో 810 మెగావాట్ల ఉత్పత్తికి అంతరాయం కలిగింది. ఈ కేంద్రంలో ఒక విభాగంలో 210 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మూడు యూనిట్లు, రెండవ విభాగంలో 600 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లలో 1,830 మెగావాట్లు ఉత్పత్తి అవుతోంది. ఈ క్రమంలో, ఒకటో విభాగంలో ఉన్న మొదటి యూనిట్, రెండో విభాగంలో ఉన్న రెండో యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ లీకేజీ కారణంగా మొత్తం 810 మెగావాట్ల విద్యుదుత్పత్తికి అంతరాయం కలిగిందని, మరమ్మతులు పూర్తిచేసి ఉత్పత్తి ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

10వ శతాబ్దం నాటి శాసనం లభ్యం



చెన్నై, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా ఇల్లూపూర్ తాలూకా పిలిప్పట్టి గ్రామంలో చోళుల కాలం నాటి శిలాశాసనం బయల్పడింది. మూడు వైపులా తమిళంలో అక్షరాలున్న శాసనాన్ని ఓ వ్యవసాయ క్షేత్రంలో గుర్తించినట్లు పురావస్తుశాఖ డైరెక్టరేట్ అధికారులు తెలిపారు. ఇది 10వ శతాబ్దానికి చెందినదని వారు వివరించారు. ఇది కొడుంబలూరుకు చెందిన ఐనుర్రువర్లు, సాలియర్, మువాయిరట్టు ఐనుర్రువర్లు, ఎరివీరపట్టినానికి చెందిన వ్యాపార సంఘాలను ప్రస్తావిస్తోంది. మదురై, పూంగుండ్రం, పురమలై, మనలూర్‌నాడులోని వివిధ ప్రాంతాల నుంచి వర్తక సమూహాలు వచ్చినట్లు ఈ శిలాశాసనం చెబుతోంది. ఈ శాసనం చోళ రాజైన కొప్పరకేసరి కాలంనాటిదని పురావస్తుశాఖాధికారులు పేర్కొన్నారు. ఈ శాసనంపై ఆయుధాల చిహ్నాలు, త్రిశూలం, కొడవలి, కత్తి, రాజగొడుగు వంటి ఉపకరణాలు కూడా చెక్కబడి వుండడం విశేషం.

21 నుంచి 'ఈ-కామర్స్'పై శిక్షణ

పెరంబూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి, ఆవిష్కరణ సంస్థ ఆధ్వర్యంలో 'ఈ-కామర్స్'పై ఈ నెల 21 నుంచి 23వ తేది వరకు శిక్షణ ఇవ్వనుంది. ఈ శిక్షణలో ఎలక్ట్రానిక్స్ కామర్స్ పరిచయం, కామర్స్ వ్యాపారం ఏర్పాటు, ఉత్పత్తి నిర్వహణ, మార్కెటింగ్, ఆర్థిక నిర్వహణ, పెరుగుదల, విస్తరణ తదితర అంశాలపై నిపుణులు వివరించనున్నారు. ఆసక్తి కలిగిన వారు పేరు నమోదు, శిక్షణ సంబంధిత వివరాలకు www. editn.in అనే వెబ్‌సైట్, 9841693060, 9677152265 అనే నెంబర్లను సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5.45 గంటల్లోపు సంప్రదించవచ్చు.

విదేశీ ప్రయాణికుడి నుంచి జీపీఎస్ పరికరం స్వాధీనం


పెరంబూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) స్థానిక మీనంబాక్కం విమానాశ్రయంలో ఓ విదేశీ ప్రయాణికుడి నుంచి జీపీఎస్ పరికరాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం అర్ధరాత్రి నగరం నుంచి బెంగళూరు వెళ్లే ఇండిగో విమాన ప్రయాణికుల లగేజిని విమానాశ్రయ అధికారులు తనిఖీ చేశారు. ఆ సమయంలో, ఫ్రాన్స్ దేశానికి చెందిన ఫెర్నాండు (62) బ్యాగులో జీపీఎస్ పరికరాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై అధికారులు అతడిని ప్రశ్నించగా, తమ దేశంలో విమానాల్లో జీపీఎస్ పరికరం తీసుకెళ్లేందుకు అనుమతిస్తున్నారని, తాను ఈ పరికరంతో నేపాల్, ఢిల్లీ ప్రాంతాల్లో పర్యటించి మూడు రోజుల క్రితం నగరానికి చేరుకున్నట్లు తెలిపారు. విమానాల్లో జీపీఎస్ తీసుకెళ్లడంపై నిషేధం ఉన్నట్లు తనకు తెలియదని ఫ్రాన్స్ దేశస్థుడు అధికారులకు వివరణ ఇచ్చాడు. దీంతో, అధికారులు అతడి ప్రయాణం రద్దు చేసి విమానాశ్రయ పోలీసులకు అప్పగించారు.

తిరుచ్చి-తాంబరం మధ్య ప్రత్యేక జనశతాబ్ది రైళ్లు

పెరంబూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం తాంబరం-తిరుచ్చి-తాంబరం మధ్య ప్రత్యేక జనశతాబ్ది రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06190 తిరుచ్చి-తాంబరం జనశతాబ్ది సూపర్‌ఫాస్ట్ రైలు ఈ నెల 4,5,10,11,12,13,17,18,19 తేదీల్లో తిరుచ్చిలో ఉదయం 5.35 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 12.30 గంటలకు తాంబరం చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.-06191 తాంబరం-తిరుచ్చి జనశతాబ్ది సూపర్‌ఫాస్ట్ రైలు ఈ నెల 4,5,10,11, 12,13,17,18,19 తేదీల్లో తాంబరం నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకు బయల్దేరి రాత్రి 11.35 గంటలకు తిరుచ్చి చేరుకుంటుంది. ఈ రైళ్ల మందస్తు రిజర్వేషన్ ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు.

బిర్యానీలో పురుగులంటూ యువకుడి డ్రామా

● అదుపులోకి తీసుకున్న పోలీసులు



ప్యారీస్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ గాంధీపురంలోని ఓ రెస్టారెంట్‌లో మటన్ బిర్యానీ, ఇతర వంటలను ప్రియురాలితో కలిసి ఆరగించిన ఓ యువకుడు బిల్లు చెల్లించడానికి ఇష్టపడక బిర్యానీలో పురుగులున్నాయంటూ నాటకమాడి దొరికిపోయాడు. పోలీసుల కథనం మేరకు, కోవై గాంధీపురం బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్‌కు నూతన సంవత్సరం రోజున తన ప్రియురాలితో కలిసి వెళ్లిన ఓ యువకుడు బిర్యానీ ఆర్డర్ చేశాడు. అది తింటున్న క్రమంలో చివర్లో కొంత మిగిల్చి అందులో పురుగులున్నాయంటూ రెస్టారెంట్ యాజమాన్యంతో గొడవకు దిగి, ఆ దృశ్యాన్ని వీడియో తీసి, బిల్లు చెల్లించకుండా వెళ్లిపోయాడు. అంతటితో ఆగకుండా గురువారం సాయంత్రం ఆ వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. ఆ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో సామిజిక మాధ్యమాల్లో ఆ రెస్టారెంటును ప్రజలంతా వ్యతిరేకించారు. దీంతో అనుమానం వచ్చిన ఆ రెస్టారెంట్ నిర్వాహకులు సీసీ పుటేజీని క్షుణ్ణంగా పరిశీలించగా వాస్తవం వెలుగు చూసింది. రెస్టారెంటుకు వచ్చిన ఆ ఇద్దరు బిర్యానీ తింటూ తన బ్యాగ్‌లో ప్యాకెట్ నుంచి పురుగులను తీసి వారు తింటున్న ప్లేట్లలో వారే వేసుకున్న దృశ్యం కనిపించింది. దీంతో తమ రెస్టారెంటుపై దుష్ప్రచారం చేసిన ఆ యువకుడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టగా, ఆ యువకుడి తీరుపై పలువురు నెటిజన్లు ఖండిస్తున్నారు.

ఏనుగు దంతాల స్మగ్లింగ్

● ఐదుగురి అరెస్ట్

ప్యారీస్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలో చట్టవిరుద్ధంగా ఏనుగు దంతాలు విక్రయించేందుకు ప్రయత్నించిన ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. సేలం జిల్లాలోని మెట్టూరు, కొలత్తూరు ప్రాంతాల అడవుల్లో కొంత మంది సంఘ విద్రోహులు ఏనుగులను వేటాడి వాటి దంతాలను విక్రయిస్తున్నారని జిల్లా అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో మెట్టూరు ఫారెస్ట్ రేంజర్ శివానందం నేతృత్వంలోని బృందం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ పరిసర ప్రాంతాల్లో మారువేషాలతో తనిఖీ చేశారు.. ఆ సమయంలో ఏనుగు దంతాల స్మగ్లింగ్ ముఠాకు చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారణ చేశారు. అతడిచ్చిన సమాచారంతో, స్మగ్లింగ్ ముఠా కోసం తీవ్రంగా గాలించారు. ఆ వ్యక్తి ద్వారా అటవీ శాఖ అధికారులు తాము ఏనుగు దంతాలు కొనుగోలు చేసే వ్యాపారులమని, సెల్‌ఫోన్ మాట్లాడి కొలత్తూర్ ప్రాంతానికి రప్పించారు. దీంతో ఆ ముఠా కారులో ఏనుగు దంతాలతో అక్కడికి చేరుకోగా, మారువేషాలతో ఉన్న అటవీ అధికారులు వారిని చుటుముట్టారు. వారి నుంచి 7 కిలోల బరువైన నాలుగు ఏనుగు దంతాలు, కారు, 7 బైకులను స్వాధీనం చేసుకున్నారు. ముఠాకు చెందిన పళని (48), సెల్వకుమార్ (40), పెరుమాళ్ (50), ఒండియప్పన్ (59), అరుణాచలం (45)లను అరెస్ట్ చేసి శుక్రవారం కోర్టులో హాజరుపరచిన అనంతరం రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో డీఎంకే కార్యకర్త మృతి

ప్యారీస్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మదురై జిల్లా తిరుమంగళంలో లారీ ఢీకొనడంతో డీఎంకే 14వ వార్డు కార్యదర్శి పాల్‌పాండి (53) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. గురువారం పాల్‌పాండి తన వాహనంలో తిరుమంగళం పంచాయితీ కార్యాలయానికి వెళ్తుండగా బైక్‌పై నుండి పడటం, వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఆయన మృతికి డీఎంకే నేతలు సంతాపాన్ని తెలిపి అతని భౌతిక కాయానికి శ్రద్ధాంజలి ఘటించారు.

రూ.250కే ఫుల్ బాడీ చెకప్

వాషర్‌మెన్‌పేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో ఫుల్ బాడీ చెకప్ రూ.250కు చేయనున్నారు. ఈ సదుపాయాన్ని ఆసుపత్రి డీన్ శివశంకరన్ గురువారం ప్రారంభించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ఫుల్ బాడీ చెకప్ కోసం ప్రజలు పేర్లు నమోదుచేసుకోవచ్చు. ప్రాథమిక స్థాయిలోనే వ్యాధులు గుర్తించి, అందుకు తగిన చికిత్స అందించేందుకు వీలవుతుందని, అతి తక్కువ ఫుల్ బాడీ చెకప్ ఇస్తున్నామని ఆయన తెలిపారు.

సెప్టిక్ ట్యాంక్‌లో పడి చిన్నారి మృతి

ప్యారీస్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లాలోని ఓ ప్రవేటు పాఠశాల సెప్టిక్ ట్యాంకులో పడి మూడేళ్ల చిన్నారి శుక్రవారం మృతిచెందిన సంఘటన స్థానికులను ఆందోళనకు గురిచేసింది. విక్రవాండిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఎల్‌కేజీ చదువుతున్న లియాలక్ష్మీ (3) శుక్రవారం ఉదయం పాఠశాల ప్రాంగణంలో ఆడుకుంటోంది. అక్కడికి సమీపంలో తెరిచివున్న సెప్టిక్ ట్యాంక్‌లో పడి ఊపిరాడక మరణించినట్లు తెలిసింది. సమాచారం తెలిసి అక్కడికి చేరుకున్న పోలీసులు చిన్నారి మృతదేహాన్ని బయటకుతీసి ఆస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా పాఠశాల యాజమాన్యం వైఖరిని ఖండిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన వ్యక్తంచేశారు. చిన్నారి మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని పీఎంకే అధ్యక్షుడు రాందాస్ డిమాండ్ చేశారు.

సహకార సంఘాల ద్వారా చెరకు కొనుగోళ్లు

ప్యారీస్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పొంగల్ పండుగ సందర్భంగా రేషన్ కార్డు దారులకు పంపిణీ చేయనున్న చెరకును సహకార సంఘాల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేయనున్నట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు సచివాలయం శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో, రాష్ట్రంలో చెరకు పండించిన రైతులు దళారుల ప్రమేయంలేకుండా, వ్యవసాయ సహకార విక్రయ సంఘాలను సంప్రదించి చెరకు విక్రయించాలని సూచించింది. ఆయా జిల్లాల్లోని వ్యవసాయ శాఖ సబ్ రిజిస్టర్లను రైతులు కలిసి ప్రభుత్వానికి సరఫరా చేయనున్న చెరకు వివరాలను ముందుగానే తెలియజేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

పారిశ్రామిక వేత్త ఇంటో నగల చోరీ

ఐసిఎఫ్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక నుంగంబాక్కం లేక్ ఆవెన్యూ రోడ్డులో నివసిస్తున్న పారిశ్రామికవేత్త అబుబక్కర్ ఇంటిలో చోరీ జరిగింది. ఇటీవల ఆయన తన కుటుంబంతో కలిసి ఊరికి వెళ్లి, తిరిగి శుక్రవారం ఉదయం ఇంటికి రాగా, తలుపు తాళం పగులగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా, బీరువాలోవున్న 150 సవర్ల నగలు, రూ.6 లక్షలు కనిపించపోవడంతో అబుబక్కర్ నుంగంబాక్కం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూస్ టీమ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

వాంతులు - విరోచనాలతో మహిళ మృతి

● ఆస్పత్రిలో చేరిన 14 మంది

ఐసిఎఫ్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువొత్తియూర్, అప్పార్‌నగర్ ప్రాంతంలో సుమారు 300 పైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన జయపాల్ భార్య దేశ్‌ప్పాటి (65)కు ఇటీవల పదిసార్లకు పైగా వాంతులు, విరోచనాలు కావడంతో తండయార్‌పేటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా, పరిశీలించిన వైద్యులు ముందుగానే అనారోగ్యంతో బాధపడుతున్నట్లుగా గుర్తించి మెరుగైన చికిత్స కోసం స్టాన్లీ ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. స్టాన్లీలో చికిత్స తీసుకొని ఇంటికి తిరిగివెళ్లిన దేశ్‌ప్పాటి హఠాత్తుగా మృతిచెందింది. ఇదిలా ఉండగా ఇదే ప్రాంతానికి చెందిన మరో 14 మందికి కూడా వాంతులు, విరోచనాలతో తొండయార్‌పేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈమె మృతికి కారణం కలుషిత నీరే కారణమని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ, చెన్నై కార్పొరేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అప్పార్‌నగర్ చేరుకున్న కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది రోడ్లను, మురుగునీటి కాలువలను బ్లీచింగ్ పౌడర్లతో శుభ్రం చేశారు. ఈ ప్రాంతానికి కొళాయి పైప్‌లైన్లు, తాగునీరందించే లారీ ట్యాంకర్ల నీటిని శాంపిల్స్‌ను సేకరించిన అధికారులు ల్యాబ్‌కు పంపించారు.

కోయంబేడులో ఆక్రమణల తొలగింపు

పెరంబూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు మార్కెట్ సమీపంలోని 100 ఆక్రమణ దుకాణాలను శుక్రవారం అధికారులు తొలగించారు. ఈ ప్రాంతంలోని టాస్మాక్ దుకాణంలో మద్యం సేవించిన వారు, ఆ మార్గంగా వెళ్తున్న మహిళలను హేళన చేయడం, ఆ ప్రాంతాల్లోని దుకాణాల్లో చిరుతిండ్లు తింటూ అల్లర్లకు పాల్పడుతున్నారని ఆ ప్రాంత ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో, కోయంబేడు మార్కెట్ దుకాణాల నిర్వహణ అధికారి ఇందుమతి నేతృత్వంలో కార్మికులు, టాస్మాక్ దుకాణం చుట్టుపక్కల ప్రాంతాల్లో వేసిన మద్యం బాటిళ్లు, వ్యర్థాలను తొలగించారు. అలాగే, ఆ మార్గంలో ట్రాఫిక్ రద్దీ కలిగించేలా ఏర్పాటు చేసిన 100 ఆక్రమణ దుకాణాలను తొలగించారు. ఈ ప్రాంతంలో మద్యం సేవించి అల్లర్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు చేపడతామని పోలీసులు హెచ్చరించారు.

సిట్ విచారణలో మలుపు

● వైద్యపరీక్షలు వద్దన్న బాధితురాలు

చెన్నై, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అత్యాచారానికి గురైన యువతి కేసు దర్యాప్తులో భాగంగా వైద్య పరీక్షలు చేయకూడదంటూ రాతపూర్వకంగా సిట్ అధికారులకు తెలియజేసింది. హైకోర్టు ఆదేశం మేరకు ముగ్గురు మహిళా ఐపీఎస్‌లతో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈ కేసు విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సిట్ సభ్యులు శుక్రవారం బాధితురాలిని విచారించారు. అన్నా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని ఆ యువతి అధికారులకు వివరించింది. ఎట్టి పరిస్థితులలో తనకు వైద్య పరీక్షలు జరుపకూడదని ఆ యువతి సిట్ సభ్యులకు రాతపూర్వకంగా తెలియజేసింది. అత్యాచారానికి పాల్పడిన జ్ఞానశేఖరన్‌ను కూడా విచారించేందుకు సిట్ సభ్యులు సిద్ధమవుతున్నారు.

90 జలాశయాల్లో 198 టీఎంసీల నీటినిల్వలు

పెరంబూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జలాశయాల్లో 198 టీఎంసీల నీటినిల్వలున్నాయి. రాష్ట్ర జలవనరుల శాఖ పర్యవేక్షణలో 90 జలాశయాలున్నాయి. ఈ జలాశయాల పూర్తి సామర్థ్యం 224 టీఎంసీలు. వాటిలో మేట్టూరు, భవానీసాగర్, ముల్లైపెరియార్, పరంబికళం తదితర 18 జలాశయాలు అధిక సామర్థ్యం కలిగి ఉన్నాయి.

స్వార్థం పెరిగిపోతున్న ఈ రోజుల్లో ధనం ఎంత ఉన్నా దానిలో కొంతైనా సమాజసేవకు ఉపయోగించాలనే ఆలోచన మనుషుల్లో కరువవుతున్నది. ఉన్న దానిలో ఇతరులకు తోచినంత సాయం చేయాలనుకునే వారు అరుదుగానే ఉన్నారు. అదేవిధంగా పిల్లలకు విలువలు నేర్పించడంలో పెద్దల పాత్ర ప్రముఖం. నైతిక, మానవీయ విలువలతో పెరిగినవారు సమాజంలో మంచి వ్యక్తులుగా రూపొందుతారు. అలాంటి కోవకు చెందిన వారు డాక్టర్ ఏవీ శివకుమారి. ఆమె సమాజ సేవా ప్రస్థానం యీనాటి 'తరుణి'లో...

- వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి



లయన్స్ క్లబ్ తరపున సేవా కార్యక్రమంలో...



సీనియర్ నటుడు చంద్రమోహన్ నుండి పురస్కారం అందుకుంటూ...



చెన్నై తెలుగు అసోసియేషన్ పురస్కారం



తరుణి

సాహిత్యాభిలాష సమాజసేవ

● విభిన్న రంగాల్లో రాణిస్తున్న డాక్టర్ ఏవీ శివకుమారి

సమాజ సేవకు అంకురార్పణ....

తన జీవితంలో సమాజసేవకు అంకురార్పణ ఎలా జరిగిందో చెబుతూ..."నా చిన్నతనంలో మా నాన్న తన పరిధిలో ఎంతో మందికి సాయం చేయడం గమనించాను. 'మానవ సేవే మాధవ సేవ' అన్న విషయాన్ని తెలియపరిచారు. సేవా దృక్పథాన్ని అలవరచారు. ఆయన ప్రభావం బాల్యంలోనే నా మనసుపై గాఢంగా ముద్రవేసింది. పాఠశాలలో చదువుకొనే రోజుల్లోనే దాచుకున్న డబ్బును పేద విద్యార్థులకు విద్యాసామగ్రి కోసం వెచ్చించేదాన్ని. అదే నేడు ఒక అలవాటుగా మారింది. పేదలకు, ఆర్తులకు, చేతనైన సాయం చేయడంలో ఎనలేని ఆనందం పొందుతాను" అన్నారు శివకుమారి.

శివకుమారి పుట్టింది ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలోనైనా, పెరిగింది చెన్నైలోనే. తండ్రి అలూరి రామస్వామి, ఇంజనీర్‌గా పనిచేశారు. తల్లి బసవపూర్ణావతి, గృహిణి. శివకుమారికి ఇద్దరు సోదరీమణులు, ఒక సోదరుడు.



సాహితీసేవ...

'ఎర్రర్ ఎనాలిసిస్ ఆఫ్ లెర్నింగ్ హిందీ అండ్ తెలుగు లాంగ్వేజెస్' అన్న పరిశోధన గ్రంథం శివకుమారి తొలిరచనగా ముద్రించబడి అప్పటి తమిళనాడు గవర్నర్ రామమోహన రావు ద్వారా ఆవిష్కరింపబడింది. ద్రావిడ ఉద్యమనేత 'తంథై పెరియార్' రచించిన 'పెన్ ఏన్ అడిమై యానాళ్ (స్త్రీ ఎందుకు బానిస అయింది)' అనే తమిళ పుస్తకాన్ని తెలుగులోకి అనువదించారు శివకుమారి. హైదరాబాదు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కేరళ, కుప్పం, మద్రాసు మొదలైన విశ్వవిద్యాలయాలలో వందకు పైగా పత్ర సమర్పణలు చేశారు. అవిశ్రాంత సాహితీ సేవకురాలిగా ఇప్పటికీ పలు విశ్వవిద్యాలయాల్లో పత్ర సమర్పణలు గావిస్తూ తన సాహిత్యాభిలాషను చాటుకుంటున్నారు.

విద్యాభ్యాసం...

శివకుమారి పాఠశాల విద్య కేటీసీటీ హయ్యర్ సెకండరీ స్కూలులో జరిగింది. అనంతరం బీకామ్‌లో పట్టా పొందాక ధర్మపురిలో సెకండరీ గ్రేడ్ ట్రైనింగ్ చేశారు. చెన్నైలోని లేడీ వెల్లింగ్టన్ హయ్యర్ సెకండరీ స్కూలులో 15 సంవత్సరాలపాటు ఉపాధ్యాయురాలిగా సేవలందించారు. ఒక వైపు ఉద్యోగం చేస్తూనే మరో వైపు దూరవిద్య ద్వారా ఎంఏ (తెలుగు), ఎంఏ (హిందీ), బి.ఈడీ, ఎంఈడీ కోర్సులు పూర్తిచేశారు. మద్రాసు విశ్వవిద్యాలయంలో ఈవెనింగ్ కాలేజీలో చేరి ఎం.ఫిల్, పీహెచ్‌డీ సాధించారు. కోడంబాక్కంలోని ప్రభుత్వ హయ్యర్ సెకండరీ స్కూలులో హిందీ పీజీ టీచర్‌గా నియమితులై, అక్కడే పదవీవిరమణ చేశారు.

వ్యక్తిత్వం

శివకుమారిది ఒక విలక్షణమైన వ్యక్తిత్వం. నిబద్ధత గలిగిన ఉపాధ్యాయురాలిగా ఎంతో మందిని తీర్చిదిద్దారు. జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా, పెదవులపై చిరునవ్వు తొలగిపోనీయలేదు. ధైర్యం ఆమె సొత్తు, ప్రతికూల ఆలోచనలకు అవకాశం ఇవ్వకుండా సానుకూల దృక్పథంతో విషయాలను పరికించడం ఆమె నైజం. 'ప్రార్థించే పెదవులు కన్నా... సేవచేసే చేతులు మిన్న' అన్న సత్యాన్ని ఆమె బలంగా నమ్ముతారు.

అభిరుచులు

నాట్యంలో అభిరుచి, ఆసక్తి మాత్రమేకాక ప్రవేశం కూడా ఉంది. భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో ప్రావీణం సంపాదించారు. వెంపటి చిన సత్యం శిష్యురాలిగా ఆయనతో కలసి దేశ, విదేశాల్లో ఎన్నో నృత్య ప్రదర్శనలిచ్చారు. బాల్యం నుండి పలు రేడియో కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్కేటింగ్, స్విమ్మింగ్, పారాగ్లైడింగ్ మొదలైన వాటిల్లో కూడ ఆమె శిక్షణ పొందారు. శివకుమారి అభిరుచుల్లో మరొకటి ప్రయాణాలు. వీలైనప్పుడల్లా స్నేహితులతో కలసి దేశ విదేశాలు దర్శిస్తుంటారు. ఇలా 15 దేశాల్లో ఆమె పర్యటించారు.

"పిల్లలకు బాల్యం నుండే నైతికవిలువలు బోధించాలి. మంచితనం, మానవత్వం నేర్పాలి. మాతృభాషపై మమకారం పెంచాలి. అన్ని పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనే మనోస్థైర్యం, ఆత్మవిశ్వాసం పిల్లలలో పెంపొందించాలి. తల్లిదండ్రులు, గురువులు, పిల్లల సంపూర్ణ మూర్తి మంతానికి కృషిచేయాలి". అని శివకుమారి తరుణితో తన మనోభావాలను పంచుకున్నారు.



మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య నుండి పురస్కారం అందుకుంటూ...

సమాజసేవ.. : తండ్రిని స్ఫూరిగా తీసుకొని శివకుమారి పలు సమాజసేవా కార్యక్రమాలు చేస్తుంటారు. లయన్స్ క్లబ్ ఆఫ్ స్వాగతంలో పలు హోదాల్లో పనిచేసిన ఆమె క్లబ్ తరపున ఎన్నో పాఠశాలల్లో తాగునీటి సదుపాయంతో పాటు, మౌలిక సదుపాయాలను కల్పించారు. పేద విద్యార్థులకు, పారిశుధ్య కార్మికులకు ధనసహాయం చేశారు. ఏ ప్రదేశానికి వెళ్లినా, పేదలు, ఆపన్నులకు సహాయం చేయటానికి ముందుంటారు ఆమె. అనాథ శరణాలయాలకు, వృద్ధాశ్రయాలకు వెళ్లి వారి అవసరాలకు అనుగుణంగా సహాయమందిస్తారు.



ఉత్తమ ఉపాధ్యాయులు పురస్కారం అందుకుంటూ...

పురస్కారాలు... : సమాజసేవా కార్యక్రమాలను అంకితభావంతో చేసే శివకుమారిని ఎన్నో పురస్కారాలు వరించాయి. ఆరోగ్య, విద్యా రంగాల్లో ఆమె చేసిన సేవలకు తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య జ్ఞాపికతో సత్కరించారు. మహాత్మాగాంధీ మెమోరియల్ ట్రస్ట్ ఆఫ్ నార్త్ టెక్సాస్ (యూఎన్‌ఏ) సంస్థచే 'ఇర్వింగ్'లో జరిగిన గాంధీ ముని మనవడు సతీష్ దుపేలియా చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ తొలి గవర్నర్ బ్యారీపామర్ తనను సత్కరించడం మరచిపోలేని అనుభూతి అని తెలిపారు శివకుమారి. సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్ట్ అధికారుల నేతృత్వంలో రాష్ట్రానికి చెందిన కొందరు విద్యార్థులతో కలసి అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌ని కలవడం, విందులో పాల్గొనడం మరచిపోలేని సంఘటనగా అభివర్ణించారు ఆమె. చెన్నైలోని అనేక తెలుగు సంఘాల్లో సభ్యురాలైన శివకుమారి తెలుగు కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని తన వంతు సేవలందిస్తుంటారు.

ఎస్ఆర్ఎంలో 'శిఖరం' యువజనోత్సవాలు



బహుమతి ప్రధానోత్సవంలో ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ఛాన్సలర్ పారివేందర్ తదితరులు

చెన్నై, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్టాన్‌కుళత్తూరులోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో 38వ అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల యువజన ఉత్సవాలను 'శిఖరం' పేరుతో వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను ఆ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ఛాన్సలర్ పారివేందర్ ప్రారంభించారు. ఇందులో మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో తిరువాదిరై కాళి చండీ మేళం, భారతిదాసన్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలతో గ్రామీణ నృత్యం, శంకర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మోహిని ఆట్టమ్, అమృత విశ్వవిద్యాలయంలో ఆధ్వర్యంలో కర్ణాటక సంగీత కచేరీ, మలయాళ సంగీత విభావరి, ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో భరతనాట్యం, ఒయిలాట్టమ్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించినట్లు కార్యక్రమ నిర్వాహకురాలు మమతా అగర్వాల్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలే కాకుండా ఆంధ్రప్రదేశ్, కేరళ రాష్ట్రాల నుంచి మొత్తం 21 విశ్వవిద్యాలయాల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఈ యువజనోత్సవాలలో కేరళ విశ్వవిద్యాలయం విజేతగా నిలిచింది. గెలుపొందిన ఆ విశ్వవిద్యాలయం నిర్వాహకులకు పారివేందర్ ట్రోఫీలను బహూకరించారు.

మిస్టర్ తమిళగం, మిస్ తమిళగం విజేతల ప్రకటన



విజేతలు

చెన్నై, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): 'ఇండియన్ మీడియా వర్క్స్' ఆధ్వర్యంలో ఇటీవల చెన్నైలో జరిగిన 'మిస్టర్, మిస్, మిసెస్ తమిళం' పోటీలు ముగిశాయి. ఇందులో మిస్టర్ తమిళగం టైటిల్‌ను భరద్వాజ్, జూడ్, గెలుచుకోగా, మిస్ తమిళగం టైటిల్ కీర్తన, మిసెస్ తమిళంగా రక్షణ నిలిచారు. మిస్టర్ తమిళగం విభాగంలో 1, 2వ రన్నర్లుగా ఇబ్రహీం, మానవ్‌పటేల్, మిస్ తమిళగం విభాగంలో 1, 2 రన్నర్లుగా అనూష, సినీమిక, మిసెస్ తమిళగం 1, 2వ రన్నర్లుగా ప్రీతి, మిసెస్ గాడెస్ నిలిచారు. విజేతలను నిర్వాహకులు కిరీటాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఇండియన్ మీడియా వర్క్స్ మేనేజింగ్ డైరెక్టర్ జాస్ అమలన్ మాట్లాడుతూ.. ఈ సీజన్‌లో విజేతలు అసాధారణమైన ప్రతిభావంతులని, రేపటి తరం పెద్ద స్టార్లుగా ఎదగగలరని ఆశాభావం వ్యక్తం చేశారు.

13 నుంచి 'చెన్నై సంగమం'

● ప్రారంభించనున్న సీఎం స్టాలిన్

వాషర్‌మెన్‌పేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసెంట్ నగర్ ఎలియట్స్ బీచ్, తిరువాన్మియూర్ బీచ్, గిండి కత్తిపార ప్రాంగణం సహా 18 ప్రాంతాల్లో 'చెన్నై సంగమం-నమ్మ ఊరు తిరువిళా' పేరుతో కళా ప్రదర్శనలు జరుగనున్నాయి. ఈ విషయమై వేడుకల కమిటీ ఆర్గనైజర్, ఎంపీ కనిమొళి శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కీల్పాక్కం ఏకాంబరేశ్వర ఆలయ మైదానంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ వేడుకలు ప్రారంభించనున్నారని తెలిపారు. ఈ నెల 14 నుంచి 17వ తేది వరకు సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు గ్రామీణ కళారూపాలు, పొరుగు రాష్ట్రాల సంప్రదాయ నృత్యాలు ఈ ప్రదర్శనలో చోటుచేసుకుంటాయని, సుమారు 1,500 మంది కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొంటారని కనిమొళి తెలిపారు.

కార్పొరేట్ గవర్నెన్స్‌ను కాపాడడంలో సీఎస్‌లది కీలకపాత్ర

● ఇన్‌కం ట్యాక్స్ చీఫ్ కమిషనర్ సుధాకర రావు

చెన్నై, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ గవర్నెన్స్‌ను కాపాడటంలో కంపెనీ సెక్రటరీ (సీఎస్)లది కీలక పాత్ర అని చెన్నై ఇన్‌కంట్యాక్స్ చీఫ్ కమిషనర్ డాక్టర్ డి.సుధాకర్ రావు పేర్కొన్నారు. అందుకే తమ రెగ్యులేటర్లకు సీఎస్‌లపై పూర్తి విశ్వాసముందని ఆయన వ్యాఖ్యానించారు. నగరంలో ఇటీవల 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) నేషనల్ ట్యాక్స్ కాన్ఫరెన్స్ జరిగింది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా సుధాకర్‌రావు హాజరయ్యారు. అదే విధంగా ఈ కార్యక్రమానికి హాజరైన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై మాట్లాడుతూ.. దేశ ఆర్థికాభివృద్ధికి పెరుగుతున్న కంపెనీల సంఖ్యతో మరింతమంది సీఎస్‌లు అవసరమవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీఎస్ఐ అధ్యక్షుడు సీఎస్‌బీ నరసింహన్, కౌన్సిల్ సభ్యుడు సీఎస్ మోహన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



→ కాన్ఫరెన్స్‌లో ప్రముఖులు

'మ్యాన్ ఆఫ్ ది తమిళనాడు' పోటీలకు విశేష స్పందన



నజీరుద్దీన్, మనోజ్, అఖిల్, ఆనంద్, కృష్ణన్

చెన్నై, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): 'తమిళనాడు మోడల్స్ అసోసియేషన్' ఆధ్వర్యంలో ఇటీవల చెన్నైలో జరిగిన 'మ్యాన్ ఆఫ్ ది తమిళనాడు' పోటీలకు విశేష స్పందన లభించింది. 250 మంది అభ్యర్థులు పోటీ పడగా, ట్రెడిషనల్ రౌండ్, ఫిట్‌నెస్ రౌండ్, కార్పొరేట్ స్టయిల్, క్యూ అండ్ ఎ రౌండ్‌ల ద్వారా 40 మంది ఫైనల్స్‌కు చేరుకున్నారు. ఇందులో విశేష ప్రతిభాపాటవాలు ప్రదర్శించిన నజీరుద్దీన్, మనోజ్, అఖిల్, ఆనంద్, కృష్ణన్ ఫిలిప్పీన్స్ దుబాయ్, మలేసియా, వియత్నాంలో జరిగే ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురుషుల అందాల పోటీల్లో తమిళనాడుకు ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు ప్రకటించారు. ఈ పోటీలకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు అతిథులుగా హాజరయ్యారు.

నటి సీతకు మాతృవియోగం

చెన్నై, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సీనియర్ నటి సీతకు మాతృవియోగం కలిగింది. గత కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న సీత తల్లి చంద్రమోహన్ (88) శుక్రవారం వేకువజామున 5 గంటలకు చెన్నైలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. చంద్రమోహన్ అసలు పేరు చంద్రావతి. ఆమె స్వస్థలం సేలం కాగా, చెన్నైకి చెందిన పీఎస్ మోహన్‌బాబును వివాహం చేసుకుని, ఇక్కడకు వచ్చేశారు. అనంతరం ఆమె తన పేరును చంద్రమోహన్‌గా మార్చుకున్నారు. ఈ దంపతులకు కుమారులు ఎంజీఆర్ పాండు, రాజమోహన్, కుమార్తె సీత వున్నారు. చంద్రమోహన్ సుమారు 4 దశాబ్దాల పాటు చెన్నై జీహెచ్‌లో, తొమ్మిదేళ్ల పాటు సూర్య ఆస్పత్రిలో నర్సుగా పనిచేశారు.. పీఎస్ మోహన్‌బాబు కూడా పలు చిత్రాల్లో నటించారు. పదేళ్ల క్రితమే ఆయన కన్నుమూశారు. ఇదిలా వుండగా శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు చంద్రమోహన్ భౌతికకాయానికి స్థానిక ఆరుంబాక్కంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు ముగిశాయి. ఆమె మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.





చంద్రమోహన్ మృతదేహం - తల్లితో నటి సీత (ఫైల్‌ఫొటో)

తమిళ చిత్రజ్యోతి

చిన్న సినిమాలే జీవితాంతం గుర్తుంటాయి

● రాజ్‌కుమార్



సంగకిరి రాజ్‌కుమార్ తదితరులు

చిన్న సినిమాలే జీవితాంతం గుర్తుండిపోతాయని దర్శకుడు సంగకిరి రాజ్‌కుమార్ అన్నారు. 'వెంగాయం' చిత్రంతో ప్రశంసలు అందుకున్న ఆయన.. ఇపుడు 'బయోస్కోప్' పేరుతో నిర్మించిన మరో చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'ఇండిపెండెంట్ డాక్యుమెంటరీల ద్వారా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చాను. ఇలాంటి చిత్రాలను రూపొందించినపుడే కళాకారులకు, దర్శకులకు ఆత్మసంతృప్తి మిగులుతుందని పదేపదే చెబుతుంటాను. ఇపుడు ఇండిపెండెంట్ ఆల్బమ్‌లు, డాక్యుమెంటరీ మూవీలకు మంచి ఆదరణ ఉంది. మీ దగ్గర ఒక మంచి కథ ఉంటే, దాన్ని సినిమా తీసేందుకు ముందుకు రావాలని ఔత్సాహిక దర్శకులను కోరుతున్నాను. మరోవైపు, చిన్న చిత్రాల మార్కెటింగ్ కఠినంగా ఉంది. కానీ, ఇపుడు ప్రమోషన్, మార్కెటింగ్‌లకు అనేక మార్గాలు ఉన్నాయి. అందువల్ల ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉత్సాహభరితంగా పని చేయండి. నా తొలి చిత్రం 'వెంగాయం' సినిమా విడుదలకు ఎన్ని అడ్డంకులు ఎదురయ్యాయో... ఈ సినిమాకు కూడా అనే రకాలైన ఆటంకాలు వచ్చాయి. వాటన్నింటినీ అధికమించి ఈ సినిమాను విడుదల చేశాం' అని పేర్కొన్నారు.

'బాహుబలి'ని మించిన మూవీ

● కలైపులి ఎస్.థాను



దర్శకుడు దేశింగు పెరియస్వామి వినిపించిన కథ ఆలకించిన బడా నిర్మాత, వి క్రియేషన్స్ అధినేత కలైపులి ఎస్.థాను ప్రశంసల వర్షం కురిపించారు. ఇది బడ్జెట్‌తో తీసే సినిమా కాదు.. 'బాహుబలి'లా తీయాల్సిన సినిమా, అలా చేస్తే 'బాహుబలి'ని మించిన మూవీ అవుతుందని కితాబిచ్చారు. శింబు - దేశింగు పెరియస్వామి కాంబినేషన్‌లో ఒక సినిమా రూపొందుతున్న ప్రచారం సాగుతుంది. ఈ విషయంపై దర్శక హీరోల మధ్య కథా చర్చలు కూడా జరిగాయి. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చాలంటే భారీ బడ్జెట్ పెట్టగల నిర్మాత కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో హీరో శింబు.. నిర్మాత కలైపులి థానుకు ఫోన్ చేసి.. ఈ ప్రాజెక్టు చేద్దామని కోరడం జరిగింది. దీనిపై నిర్మాత థాను మాట్లాడుతూ, 'దేశింగు పెరియస్వామి స్టోరీ నాకు బాగా నచ్చింది. కోలీవుడ్, టాలీవుడ్, శాండల్‌వుడ్, మాలీవుడ్‌లకు చెందిన అగ్రనటీనటులను ఒకచోట కూర్చోబెట్టి స్టోరీ ఆలకించేలా చేశాను. ప్రతి ఒక్కరూ స్టోరీ అదిరిపోయిందన్నారు. సమయం, శ్రమను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును వాయిదా వేయాలని వారు సలహా ఇచ్చారు. ఎందుకంటే ఇది బడ్జెట్ సినిమా కాదు.. 'బాహుబలి'ని మించిన సినిమా. సరైన నటుడిని ఎంపిక చేసి దేశింగు పెరియస్వామి దర్శకత్వం వహిస్తే 'బాహుబలి'ని మించిన మూవీ అవుతుంది' అని కలైపులి ఎస్.థాను అన్నారు.

'అన్నాత్త'లో పాత్రపై తీవ్ర అసంతృప్తి

● ఖుష్బూ



సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా చిరుత్తై శివ దర్శకత్వంలో వచ్చిన 'అన్నాత్త' చిత్రంలో తన పాత్ర తీవ్ర అసంతృప్తికి గురిచేసిందని సీనియర్ నటి ఖుష్బూ అన్నారు. తాజాగా ఓ యూట్యూబ్ చానెల్‌కు ఆమె ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె తనలోని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే అంశంపై ఆమె మాట్లాడుతూ, "అన్నాత్త' సినిమాలో నేను, మీనా నటించాం. మేమిద్దరం హీరోయిన్లుగా ఉంటామనుకున్నాం. ఎందుకంటే రజనీ సరసన హీరోయిన్‌గా మరెవరూ నటించరని భావించాం. పైగా ఈ చిత్రంలో మా పాత్రలు కామెడీగా, ఫన్నీగా సాగుతాయి. కొన్ని రోజుల తర్వాత ఉన్నట్టుండి రజనీ సరసన హీరోయిన్‌ను ఎంపిక చేశారు. ఈ పాత్రను బలవంతంగా సృష్టించారు. దీంతో నేను, మీనా క్యారికేచర్‌గా మారిపోయాం. డబ్బింగ్ సమయంలో సినిమా చూసి చాలా నిరుత్సాహానికి గురయ్యాను' అని పేర్కొన్నారు. కాగా, సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం 2021లో దీపావళి కి విడుదలై నెగెటివ్ టాక్‌ను సొంతం చేసుకుని ప్రేక్షకులను నిరాశపరిచిన విషయం తెల్సిందే.



'కాదలిక్క నేరమిల్లై'లో జయం రవి - నిత్యా మేనన్

14న జయం రవి 'కాదలిక్క నేరమిల్లై'

ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు ఉదయనిధి సతీమణి, దర్శకురాలు కృతికా ఉదయనిధి దర్శకత్వంలో జయం రవి - నిత్యా మేనన్ జంటగా నటించిన 'కాదలిక్క నేరమిల్లై' మూవీని ఈ నెల 14న సంక్రాంతి సందర్భంగా రిలీజ్ చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. అకాడెమీ అవార్డు గ్రహీత ఏఆర్.రెహ్మాన్ సంగీత స్వరాలు సమకూర్చారు. మూవీ ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా ఇప్పటికే రెండు పాటలు విడుదల చేశారు. రెడ్ జెయింట్ మూవీస్ నిర్మించిన ఈ చిత్రాన్ని పొంగల్‌కు రిలీజ్ చేయనున్నట్టు తాజాగా ప్రకటించారు. నిజానికి అజిత్ నటించిన 'విడాముయర్చి' మూవీని రెడ్ జెయింట్ రిలీజ్ చేయాల్సి ఉంది. కానీ, 'విడాముయర్చి' సంక్రాంతి రేస్ నుంచి తప్పుకోవడంతో రెడ్ జెయింట్ మూవీస్ తమ సొంత చిత్రాన్ని విడుదల చేసేలా నిర్ణయం తీసుకుని అధికారికంగా వెల్లడించింది.


మొదటిఘాట్‌లో సోలార్ లైట్లను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ విభాగం సిబ్బంది

తిరుమల కనుమ దారుల్లో కొత్త సోలార్ దీపాలు

- మొదలైన పనులు -

తిరుమల, జనవరి3(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్లలో సోలార్ లైట్ల అమరిక పనులు మొదలయ్యాయి. 20 ఏళ్ల క్రితం ఈరోడ్లలో ఏర్పాటు చేసిన సోలార్ లైట్లు పాడైపోయాయి. గత పాలకులు వీటి నిర్వహణను పట్టించుకోలేదు. ఇందువల్ల రాత్రిపూట వాహనదారులూ, రోడ్డు దాటే సమయంలో వన్యప్రాణులూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త సోలార్ లైట్లను ఏర్పాటు చేయాలని టీటీడీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే మొదటి ఘాట్‌రోడ్లలో 70, రెండవ ఘాట్‌రోడ్డులో పది ప్రాంతాల్లో నూతన సోలార్ ప్యాడ్లు, లైట్లను ఏర్పాటు చేసే పనులు గురువారం మొదలయ్యాయి. ప్రస్తుతం మొదటిఘాట్‌రోడ్డులో పనులు జరుగుతున్నాయి. వీటి ఏర్పాటుకు దాదాపు రూ.15 లక్షల మేరకు ఖర్చు కానుంది. ఇక, తిరుమల ప్రధాన రహదారుల్లోనూ పాత లైట్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయి. శుక్రవారం జీఎన్సీ ఆర్చ్ నుంచి బాలాజీ బస్టాండ్ వరకు ఉన్న రహదారిపై 50 నూతన లైట్లను ఏర్పాటు చేశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, సినీనటి రాశి సింగ్ ఉన్నారు. ఈమేరకు వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు.


నేరెళ్ల శారద


రాశి సింగ్


శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం : రూ.4.17 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 62,085

తలనీలాలు సమర్పించినవారు: 15,680





పట్టుదల+కృషి = ఉద్యోగం

● అకడమిక్ జ్ఞానమొక్కటే సరికాదు

● అవసరమైన స్కిల్స్‌పై పట్టు సాధించాలి

ఉద్యోగ సాధనకు అకడమిక్ నాలెడ్జ్ ఒక్కటే సరిపోదంటున్నారు తిరుపతిలోని కౌటిల్య సంస్థ డైరెక్టర్ శ్రీధర్. ప్లేస్‌మెంట్ శిక్షణా సంస్థ నిర్వహిస్తున్న ఈయన యువత ఉద్యోగ సాధనకు అవసరమైన కొన్ని సూచనలిస్తున్నారు. ప్రత్యేక నైపుణ్యాలను పెంచుకుని, పట్టుదలతో సాధన చేస్తే ఉద్యోగ కల సాకారమవుతుందంటున్నారు. జాబ్ పొందడానికి ఆయన చెబుతున్న మార్గాలివి.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి


శ్రీధర్, కౌటిల్య శిక్షణా సంస్థ డైరెక్టర్



●తిరుపతి ఉపాధ్యాయనగర్‌కు చెందిన ఆదర్శ్ ఇంజినీరింగ్ చదివాడు. ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో కష్టపడి చదివాడు. మంచి మార్కులతో బీటెక్ పూర్తి చేశాడు. క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగం రాలేదు. కాలేజి నుంచి బయటపడ్డాక ఆఫ్ కేంపస్ ఉద్యోగాల కోసం చేయని ప్రయత్నం లేదు. ఇప్పటికీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు..

●పద్మావతినగర్‌కు చెందిన గాయత్రి పీజీ పూర్తిచేసింది. మంచి మార్కులే సాధించింది. ఆకాంక్షలకు తగిన ఉద్యోగమే చేయాలనేది ఆమె ఆకాంక్ష. చిన్నపాటి ఉద్యోగాలు వచ్చినా జాయిన్ కాలేదు. బ్యాంకు, ఆర్ఆర్‌బీ ఇలా ఏ నోటిఫికేషన్ కనిపించినా దరఖాస్తు చేస్తోంది. కొన్నింటికి ఎక్కువమంది హాజరవుతారని నిరాశతో పరీక్షే రాయలేదు. మూగేళ్లయినా ఉద్యోగం పొందలేకపోతోంది.

రెండు రకాల ప్లేస్‌మెంట్లు ఉంటాయి. బీటెక్, మరేదైనా డిగ్రీ చదువుతున్న విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్లకోసం సన్నద్ధమవుతుంటారు. అయినా చాలా మంది విఫలమవుతుంటారు. బీటెక్ లేదా డిగ్రీ రెండో సంవత్సరం నుంచే జాబ్ ప్రిపరేషన్ అవసరం. కంపెనీలు కోరుకుంటున్న నైపుణ్యాలను అలవర్చుకోవాలి. ప్రత్యేకించి ఏదైనా సంస్థలో ఉద్యోగం కావాలనుకుంటే ముందుగా ఆ కంపెనీకి కావాల్సిన అర్హతలు, నైపుణ్యాలను తెలుసుకోవాలి. వాటికి తగ్గట్టుగా సాంకేతిక నైపుణ్యాలు (కోడింగ్)పై దృష్టి పెట్టాలి.

అకడమిక్ చదువులతో పాటు పరిశ్రమల నైపుణ్యాలకు సంబంధించి శిక్షణ తీసుకోవాల్సి ఉంటుంది. అయినప్పటికీ ఒక్కోసారి ఉద్యోగం సాధించడంలో విఫలం కావొచ్చు. అంతమాత్రాన నిరాశపడిపోకూడదు. తాము ఎందుకు విఫలమయ్యామో స్వీయ విశ్లేషణ చేసుకోవాలి. కారణాన్ని ఖచ్చితంగా అంచనావేసి ఆయా అంశాలను సరిచేసుకుని మళ్లీ ప్రయత్నిస్తే ఖచ్చితంగా విజయాన్ని సాధించొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీ ఎక్కువగా ఉంటుంది... పోస్టులు తక్కువగా ఉంటాయి. అందుకు చాలామంది మొదట్లోనే నిరాశ పడతారు. పోటీలో నిలిచేందుకు ఆసక్తి చూపించరు. దరఖాస్తుదారులంతా పోటీ ఇవ్వరని గుర్తించరు. దరఖాస్తుదారుల్లో ఎక్కువ మంది డమ్మి అభ్యర్థులే ఉంటారు. అందువల్ల సంఖ్యను చూసి ఆందోళన చెందక్కరలేదు.. పోటీ పరీక్షకు తగినట్టు సన్నద్ధమయితే చాలు. విశ్లేషణాత్మక అధ్యయనం, అభ్యాసంతో కూడిన సాధన అవసరం. అకడమిక్ కోసం చదివినట్టు చదివితే ఉద్యోగం రాదు. పోటీ పరీక్షకు తగినట్టుగా అవసరమైన అంశాలపై ఫోకస్ పెట్టాలి.

బ్యాంకు పరీక్షలకు ప్రిపేరయితే తక్కువ సమయంలోనే ఉద్యోగం సాధిచవచ్చు. బ్యాంకు పరీక్షల సిలబస్‌తో ఏటా సుమారు 20 పోటీ పరీక్షలు జరుగుతాయి. ఒకే శిక్షణతో, ఒకే సన్నద్ధతతో 20 పరీక్షలకు పోటీ పడొచ్చు. అందువల్ల ఏదో ఉద్యోగం రాకపోదు.

పోటీ పరీక్షల ప్రిపరేషన్ మొదలుపెట్టాక ఉద్యోగం సాధించడానికి 1 నుండి మూడేళ్ల పట్టవచ్చు. కొంత మందికి ఇంకా ఎక్కువ సమయం పట్టవచ్చు. దీర్ఘకాల పోటీలో చాలామంది వైదొలుగుతారు. కేవలం సీరియస్ అభ్యర్థులు మాత్రమే నిలబడతారు. దీర్ఘకాలం సమయం, పట్టదలతో కూడిన ప్రిపరేషన్ ఉంటే సర్కారీ కొలువు సాధ్యమే.

ఉద్యోగ సాధన ప్రయాణంలో మొదటగా ఏ చిన్న ఉద్యోగం వచ్చినా వదులుకోకూడదు. ఆ ఉద్యోగం చేస్తూనే దీర్ఘకాల లక్ష్యాన్ని నెరవేర్చేందుకు ప్రయత్నించాలి. చిన్న ఉద్యోగమైనా ఆర్థికంగా ఆసరాగా ఉంటుందని గ్రహించాలి. అది ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్నిఇస్తుంది. పెద్ద ఉద్యోగం పొందేందుకు ప్రోత్సాహకరంగా ఉంటుంది.



ముక్కంటిని దర్శించుకున్న విదేశీ భక్తులు

శ్రీకాళహస్తి, జనరవి 3(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం 70మంది అమెరికా భక్తులు దర్శించుకున్నారు. పెంచలకోన కరుణామయి ఆశ్రమ వ్యవస్థాపకురాలు భగవతి విజయేశ్వరి దేవితో కలిసి వారు వచ్చారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అమెరికా భక్తుల శివనామస్మరణతో ఆలయం మారోమోగింది.

వైకుంఠ ఏకాదశికి తిరుమలలో

మైసూర్ నిపుణులచే విద్యుత్ అలంకరణలు

తిరుమల, జనవరి3(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈఏడాది వైకుంఠ ఏకాదశికి విద్యుత్ అలంకరణ విశేషంగా చేయాలని నిర్ణయించారు. మైసూర్ దసరా ఉత్సావాల్లో విద్యుత్ దీపాలంకరణలు చేసే నిపుణులు తిరుమలలో కూడా అలంకరణ చేస్తారు. అలాగే ప్రత్యేకమైన పౌరాణిక పాత్రలతో కూడిన పూల అలంకరణలూ చేయనున్నారు. ఈ వివరాలను శుక్రవారం అన్నమయ్య భవనంలో జరిగిన వైకుంఠ ఏకాదశి సమీక్షా సమావేశంలో అధికారులు వెల్లడించారు. టీటీడీ ఈవో శ్యామలరావు ఆధ్వర్యంలో జరిగిన సమీక్షా సమావేశంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ, ఐటీ విభాగం జీఎం శేషారెడ్డి, అదనపు ఎస్పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి భక్తులకు సులభతరంగా వైకుంఠద్వార దర్శనం కల్పించేందుకు అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశించారు. భక్తులకు వివిధ ప్రాంతాల్లో పార్కింగ్ కేటాయించడం ద్వారా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని సూచించారు. వైకుంఠ ఏకాదశి ముఖ్యాంశాలతో అధికారులు సమగ్ర మాస్టర్ డాక్యుమెంట్‌ను రూపొందించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈవోకు వివరించారు.

నారావారిపల్లెలో

మెగా జాబ్ మేళా

● ఉద్యోగాలకు 689 మంది ఎంపిక


ఉద్యోగ నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే


జాబ్‌మేళాకు హాజరైన యువత

చంద్రగిరి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు స్వగ్రామం.. చంద్రగిరి మండలం నారావారిపల్లెలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. టీటీడీ కళ్యాణ మండపంలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ మేళాకు నియోజకవర్గంలోని 1832 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి శ్రీసిటీ, నాయుడుపేట, రేణిగుంట, గాజులమండ్యం ఎస్ఈజెడ్‌లు, అనంతపురంలోని కియా మోటార్స్.. ఇలా 21 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 689 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరందరికీ సాయంత్రం ఎమ్మెల్యే పులివర్తి నాని, కలెక్టర్ వెంకటేశ్వర్ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ జాబ్‌మేళాలో ఉద్యోగం రానివారు నిరుత్సాహ పడకుండా ఆత్మస్థైర్యంతో ఉండాలన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో కంపెనీల ఏర్పాటుకు స్థలాలు అనువుగా ఉన్నాయని, వీటి ఏర్పాటుకు సహకారం అందిస్తామన్నారు. చంద్రగిరికి త్వరలో అనేక ప్రాజెక్టులు రానున్నట్లు చెప్పారు. సీఎం చంద్రబాబు తిరుపతి పర్యటనకు వచ్చిన పుడల్లా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదేశించేవారని గుర్తుచేశారు. నారా లోకేశ్ యువగళంలో ఇచ్చిన మాట ప్రకారం నేడు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే పులివర్తి నాని చెప్పారు. ఆరు నెలలకు ఒకసారి మేళా నిర్వహిస్తామన్నారు. త్వరలో చంద్రగిరికి ఐటీ కంపెనీలు వస్తాయన్నారు. ఉద్యోగం చిన్నదైనా, పెద్దదైనా ఆత్మస్థైర్యంతో పని చేసి, తల్లిదండ్రుల కష్టాలలో పాలుపంచుకోవాలని యువతకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బొబ్బా లక్ష్మి, ఉపసర్పంచి రాకేష్‌చౌదరి, పులివర్తి సుధారెడ్డి, డీపీవో, స్పెషల్ ఆఫీసర్ సుశీలదేవి, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, స్కిల్ డెవలప్మెంట్ అధికారి లోకనాథం, తహసీల్దారు శివరామసుబ్బయ్య, ఎంపీడీవో శేఖర్, వివిధ సంస్థల ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం

రూ.1.76 కోట్లు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది


శ్రీకాళహస్తి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి హుండీ ద్వారా రూ.1,76,75,333 వచ్చింది. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ఈ హుండీ లెక్కింపు జరిగింది. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారం 73 గ్రాములు, వెండి 478.550కిలోలు, విదేశీ కరెన్సీ 186 వచ్చింది. ఈవో బాపిరెడ్డి ఈ హుండీ లెక్కింపును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు- అత్తిపట్టు

రైల్వే రూట్ మ్యాప్ సిద్ధం

— ఏపీ, తమిళనాడులో నాలుగేసి స్టేషన్లు —

పుత్తూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు- అత్తిపట్టు మధ్య రైల్వే లైను రూట్ మ్యాప్ ప్రాజెక్టు సిద్ధమైంది. 88.30 కిలోమీటర్లు.. సింగిల్ విద్యుత్ లైను మార్గంలో ఎనిమిది స్టేషన్లను ప్రతిపాదించారు. జిల్లాలో నారాయణవనం, కృష్ణమరాజుకండ్రిగ, పిచ్చాటూరు, నాగలాపురం.. తమిళనాడులో ఊత్తుకోట, పాలవ్కాకం, పెరియపాలెం, గంగయాదికుప్పంలో స్టేషన్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. పుత్తూరు రైల్వే స్టేషన్ నుంచి నారాయణవనం మూడు కిలోమీటర్ల పరిధిలో ఉండగా.. మిగిలిన స్టేషన్లు పది కిలోమీటర్ల వంతున ఉన్నాయి. పర్యాటక కేంద్రమైన కైలాసనాథకోనను దృష్టిలో ఉంచుకుని కృష్ణమరాజుకండ్రిగను కూడా స్టేషన్‌గా ప్రతిపాదించారు. ఇక, పుత్తూరు నుంచి దాదాపు 500 మీటర్ల దూరంలో అంటే నారాయణవనం రైల్వే గేటు- మరాఠీ రైల్వే గేట్ల మధ్య ఈ కొత్త రైల్వే లైను తిరుగుతుందని పేర్కొన్నారు. ఈ రైల్వే మార్గంలో 15 మేజర్.. 159 మైనర్ వంతెనలు ఉంటాయని ప్రతిపాదించారు. ప్రతిరోజు ప్రయాణికుల కోసం ఆరు బోగీలు వుండే నాలుగు ఈఎంయులు నాలుగు ట్రిప్పులు తిరగనున్నాయి. ఈ విద్యుత్ రైళ్లు ఇటు పుత్తూరు- చెన్నై, అటు సూళ్లూరుపేట-చెన్నై లైన్లలో కలుస్తాయి. దీంతో శ్రీసిటీ వెళ్లే ఉద్యోగులు, చెన్నై, పుత్తూరు వెళ్లే వ్యాపారులకు అనుకూలంగా ఉంటుంది.



ప్రాజెక్టు ఉద్దేశం

ఈ విద్యుత్‌లైన్ వల్ల ప్రధానంగా బళ్లారి నుంచి ఎగుమతయ్యే ఇనుపఖనిజం, దిగుమతయ్యే బొగ్గు రవాణాకు ఉపయోగమౌతుందని ప్రతిపాదించారు. చెన్నై ఓడరేవు మీద పెరిగిన ఒత్తిడిని తగ్గించేందుకు అట్టిపట్టు సమీపంలోని ఎన్నూరు ఓడరేవును ఎంచుకుని ఈ రైలు మార్గంను ప్రతిపాదించారు.

తిరువళ్లూరు- పెరియపాలెం రెండో విద్యుత్ లైన్

పుత్తూరు-అట్టిపట్టు లైను ప్రాజెక్టు ప్రతిపాదనలోనే తిరువళ్లూరు-పెరియపాలెం మధ్య 28.30 కిలోమీటర్ల మరో చిన్న లైనును అధికారులు ప్రతిపాదించారు. పూర్తిగా తమిళనాడులోనే వెళ్లే ఈ మార్గంలో కలింబాకం, మేల్‌కొండయార్, వెంగల్ వంటి మూడు స్టేషన్లను ప్రతిపాదించారు. ఈ రూట్‌లోనూ ప్రయాణికుల కోసం నాలుగు ట్రిప్పులు విద్యుత్ రైళ్లు తిరుగుతాయి.

విద్యార్థినిపై అత్యాచారానికి నిరసనగా

మదురైలో మహిళా మోర్చా ర్యాలీ

● ఖుష్బూ సహా పలువురి అరెస్టు

చెన్నై, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అన్నా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనపై డీఎంకే ప్రభుత్వం నిందితులకు అనుకూలంగా వ్యవహరిస్తుందంటూ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమారతి నేతృత్వంలో బీజేపీ జాతీయ కార్యనిర్వాహక కమిటీ సభ్యురాలు, ప్రముఖ నటి ఖుష్బూ ఆధ్వర్యంలో మదురైలో శుక్రవారం నిరసన ప్రదర్శన చేశారు. మదురై నుంచి చెన్నై వరకు ర్యాలీ చేసేందుకు ప్రయత్నించడంతో పోలీసుల అనుమతి లేకుండా ఈ నిరసన జరుపటంతో ఖుష్బూ సహా అందరినీ అరెస్టు చేశారు. మహిళా మోర్చా కార్యకర్తలు ఓ భారీ వ్యాన్‌లో బయలుదేరటానికి సిద్ధమయ్యారు. ఆ వ్యాన్ యాత్రకు ఖుష్బూ జెండా ఊపి ప్రారంభించారు. అనుమతి లేకుండా జరిగిన ఈ ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసు బలగాలు తీవ్రంగా ప్రయత్నించాయి. మహిళా కానిస్టేబుళ్లు ఆందోళనలో పాల్గొన్న ఖుష్బూ, ఇతర మహిళా నాయకులు, కార్యకర్తలు సుమారు 500 మందిని అరెస్టు చేసి వ్యాన్లలో తరలించారు.


ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఖుష్బూ తదితరులు

స్టాలిన్ క్షమాపణ చెప్పాలి...

ఆందోళనలో పాల్గొన్న బీజేపీ జాతీయ కార్యనిర్వాహక కమిటీ సభ్యురాలు ఖుష్బూ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని చోట్లా మహిళలకు భద్రతలేకుండా పోయిందని, విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్టాలిన్ సారీ చెప్పేంత దాకా తమ పోరాటం ఆగదని కూడా ఆమె హెచ్చరించారు.


చెన్నై ట్రిప్లికేన్‌లోని పార్థసారథి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం స్వర్గద్వార ప్రవేశ ఏర్పాట్లను పరిశీలిస్తున్న దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు


మదురై జిల్లా మేలూరు వద్ద టంగ్‌స్టన్ తవ్వకాలకు వ్యతిరేకంగా జరిగిన ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న ఎండీఎంకే నేత వైగో

నిమ్మ పరిశోధన కేంద్రంలో

యూకే పారిశ్రామికవేత్త

వెంకటగిరిటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): యునైటెడ్ కింగ్‌డం(యూకే)కి చెందిన పారిశ్రామికవేత్త హూగో బొవిల్ వెంకటగిరి సమీపంలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని నిమ్మ, చీని పరిశోధన కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఆయనతో పాటు గూడూరులోని సీఫల్ హెర్బల్ సంస్థ ఎండీ యలవర్తి విద్యాసాగర్, ఇండో వరల్డ్ ట్రేడింగ్ కార్పొరేషన్(న్యూఢిల్లీ) ఉపాధ్యక్షుడు అనిల్ కాత్యాల్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా నిమ్మ, చీని పరిశోధన శాస్త్రవేత్త శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ యూకే నుంచి భారత పర్యటనకు వచ్చిన హూగో బొవిల్ న్యూఢిల్లీ నుంచి పెట్లూరు నిమ్మపరిశోధన కేంద్రానికి వచ్చారని తెలిపారు. పెట్లూరు నిమ్మకు భారతదేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని, దాని నుంచి సుగంధ ద్రవ్యాల తయారీపై ఆరా తీశారని చెప్పారు. పెట్లూరు నిమ్మ ప్రాసెసింగ్, మార్కెటింగ్, రైతుల ఆసక్తి, నిమ్మ రకాలు తదితర అంశాలపై హూగో బొవిల్‌కు విశదీకరించారు. నిమ్మపంట ఉత్పత్తి, దిగుబడిపై వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త ఖాందర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.


పెట్లూరు నిమ్మ గురించి వివరాలు తెలుసుకుంటున్న హూగో బొవిల్